# పెంపుడు కుక్క

రచన : యం. యస్. చలం

*

శేఖరుడు కలకత్తానుండి ఓ కుక్కపిల్లను తెచ్చాడు. దాన్నిచూసి ఆ పల్లెప్రజలంతా విస్తుపోయారు. అవునుమరి—వాళ్ళు అంత అందమైన కుక్కపిల్లను యెన్నడూ చూసివుండలేదు.

ఇక శేఖరుని స్నేహితులు సరేసరి. దానిని భూమ్యాకాశాలు యేకమయ్యేట్టు స్తోత్రం చేశారు. 'ఇదిగో శేఖర్! యీ తెల్లని కుక్కముఖాన ఆ నల్ల మచ్చగనక లేకపోతే దీనికింత అందం వచ్చేదే కాదు. మామూలు కుక్కలకంటే దీనికో గోరు యెక్కువవుంది. జాతికుక్క అనటానికి యింత కంటే నిదర్శనం యేమికావాలి? అసలు దీనిని పెంచటంలోనే అచ్చుబాటవుంది! కారణం యేమిటంటే—దీని తోక చుట్టుకుపోయి వెనక్కి వాలిపోవటంలేదు.' ఈ విధమైన పొగడ్తలతో వాళ్లు శేఖరునికి సంతోషం కలిగించేవాళ్లు. ఈలోగా అతని జేబులోని సిగరెట్లు కూడా ఖాళీఅయిపోయేవి.

ఇంతమంది పొగడ్తలకు గురికాబడిన ఆకుక్కపిల్ల శేఖరునికి ప్రాణప్రదమైపోయింది. అమితోత్సాహంతో దాన్ని భుజానికెత్తుకునేవాడు. ఒక్కొక్కసారి తన ప్రక్కమీదనే పడుకోబెట్టుకుని శరీరం నిమిరేవాడు. పిల్లవాడిలా దానితో ఆటలాడేవాడు.

ఒక శుభముహూర్తాన శేఖరుడు కుక్కపిల్లకు నామకరణం చేశాడు. తనకు తెలిసివున్న కుక్కల పేర్లన్నీ తిరగవేసి 'జానీ' అనే పేరు స్థిరపరిచాడు. స్నేహితులు కూడా 'యీపేరే బాగుంది!' అని బలపరిచారు.

జానీ ఆహారం విషయం చెప్పవలసివస్తే మధ్యతరగతి మానవునికి కూడా అందుబాటులోలేని ఆహారం అది స్వీకరిస్తోంది. ఉదయం పాలు, మధ్యాహ్నం మాంసం, సాయంత్రం రొట్టె, మధ్యమధ్య యెన్నిబిస్కట్లు తింటోందో మనం లెక్కించి చెప్పటానికి వీలులేదు. ఇలా జానీ పని మూడు పువ్వులూ, ఆరుకాయలుగా వుంది.

నిత్యం అనేక కుక్కలు జానీని చూట్టానికి వచ్చేవి. కొన్ని కుంటుతూనూ, మరికొన్ని చీడతో ఆకలితో నకనకలాడుతో లోపలికిపోయిన పొట్టలతో వాటి దురవస్థను వెలిబుచ్చేవి. వాటిని చూట్టంతో జానీ మెడనున్న గొలుసు యిటూ అటూ గుంజేది. గోళ్ళతో నేలను రక్కేది. ఇదంతా చూస్తున్న శేఖరుని నౌకరు వాటిని ఫర్లాంగు దూరం తరిమి వచ్చేవాడు.

ఒకనాడు శేఖరుడు యెక్కడినుంచో యింటికి వస్తోంటే బజారులో జానీ అగుపించింది. ఓ చీడకుక్కతో అది ఆటలాడటం అతను చూడలేకపోయాడు. నౌకరుమీద తీవ్రమైన కోపంవచ్చింది. జానీని పేరుపెట్టి పిలిచాడు. అది రాలేదు. చీడకుక్కతో కలిసి పరుగెత్తిపోయింది.

శేఖరుడు యింటికివచ్చి నౌకరును గంభీరస్వరంతో 'నీకు బుద్ధిలేదు. భగవంతుడు మీ నౌకరువెధవలకు జ్ఞానంయివ్వలేదు! చీడకుక్కతో కలిసి తిరిగితే జానీ యేమౌతుందో కూడా తెలియదు. నెలకాకముందే జీతంమాత్రం చేతిలోపడాలి. వెళ్లువెతికితీసుకురా...' అంటూ ధనవంతునికి వుండవలసిన అహంకారాన్ని ప్రదర్శించుకున్నాడు.

'గొలుసు త్రెంచుకు పారిపోయింది' అని చెప్పాలనుకున్న నౌకరు యజమాని కంఠానికి హడలిపోయి ఆమాటను గొంతులోనే మ్రింగి బయటకు వెళ్ళిపోయాడు.

శేఖరుడు అనుకున్నంతా జరిగింది. మూడోనాటికల్లా జానీకి చీడపట్టింది. దానిని పోగొట్టటానికి

అతడు చాలా డబ్బు ఖర్చుపోయాడు. ప్రతి రోజూ డాక్టరువద్దకు పంపించాడు. ఆయన చెప్పిన మందులు వాడాడు. ఎన్నో సబ్బులు జానీ వంటి మీద అరిగినై. కొన్నాళ్ళకు జానీ మామూలుదై పోయింది. విశేషం యేమిటంటే యీసారి జానీ బలమైన గొలుసును మెడకు తగిలించుకోవలసి వచ్చింది.

కొన్నాళ్ళ తరువాత శేఖరుడు గ్రామాంతరం వెళ్లవలసివచ్చింది. నెలరోజులుపాటు అతడు యింటికివచ్చే అవకాశంలేదు. వెళ్లేటప్పుడు నౌకరును పిలిచి 'జానీ జాగ్రత్త! వదిలిపెట్టకు సుమా!' అని హెచ్చరించి మరీ వెళ్లాడు.

* * *

ఇంటికివస్తూనే శేఖరుడు 'జానీ యెక్కడ?' అని ప్రశ్నించాడు.

ఇంట్లో అందరూ మూగనోముపట్టారు. చివరికి నౌకరుమాత్రం భయపడుతూ భయపడుతూ సమాధానం చెప్పాడు.

'మీరువెళ్లాక తిండిమానేసింది. గొలుసుతో బయటకు తీసుకుపోతే కుక్కలలోకి పోవాలని గుంజేది. బలవంతంగా తెచ్చి కట్టేశేవాణ్ణి. గోడమీద దాని ఫొటోవేపు చూచి ఓ మొరిగేది. జబ్బేమోనని డాక్టరుబాబుకు చూపించాము. ఆయన జబ్బేమీ లేదన్నాడు. వుండివుండి మొన్ననే...' అంటూ కంటతడిపెట్టాడు.

స్తంభీభూతుడైన శేఖరుని చూపులు వీధివైపు మళ్లినై. శుష్కించిన శరీరంతో ఊరకుక్క వెళ్తోంది. 'ఇలాంటి పనికిమాలిన కుక్కలు జీవించి వుండగా పూవులలోపెంచిన నాజానీ యెలా చనిపోయింది?' అనే ప్రశ్న ఆతని హృదయకుహరంలో చెలరేగింది.

క్రొత్తరకాలు! క్రొత్తపోకడ!



స్వచ్ఛమైన బంగారు - కావలసినప్పుడు
సొమ్ము చేసుకొనవచ్చును.

ఈ నగలు బంగారు గిల్టువేసినవికావు. లోపల లోహపు కడ్డీమీద బంగారు రేకు తొడగబడియుంది. కొద్దిఖరీదుకే ఎక్కువ నగలొస్తాయి.

మా ఖాతాదారులందరు మా టి. సి. యన్. గోల్డన్ మెటల్ నగలు కొన్నిసంవత్సరాలయిన తరువాత కాంతి తగ్గుచున్నవి; అట్లులేకుండా చేయవలసినదని వ్రాసిన లేఖలకు మేము యీ జీవితకాల గ్యారంటీ రకాలను ప్రచారంలోకి పెట్టుతున్నాము.

ఉంగరము ఒకటికి రు. 10-0-0, వి. పి చార్జీ 0-10-0.



పెద్దసైజు గాజులు 2 అం. పైబడినవి జత 1-కి రూ. 20-0-0
మధ్యమసైజు గాజులు $1\frac{3}{4}$ అం. నుండి 2 అం. లోపల జత 1-కి రూ. 15-0-0
బేబీ సైజు గాజులు $1\frac{3}{4}$ అం. లోపల జత 1-కి రూ. 10-0-0
వి. పి. చార్జీలు 0-10-0.

టి. సి. నాగలింగప్ప అండ్ కో.,

280, వాల్టాక్సురోడ్, పి. టి., మద్రాసు.

ఏజంటు :—శ్రీ కె. యన్. తిమ్మప్ప శెట్టిగారు, గోపువారి బిల్డింగ్సు, బెజవాడ.